క్లుప్తంగా

ఏడుగుర్రాలపల్లి ఘటనపై హోంమంత్రి నోరు విప్పాలి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కుందుర్పి: రామగిరి మండలం ఏడుగుర్రాలపల్లి ఘటనపై హోంమంత్రి అనిత నోరువిప్పాలని వైఎస్సార్‌సీపీ దళిత నాయకులు కోరారు. సోమవారం వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం డివిజన్ అధ్యక్షుడు తిప్పేస్వామి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు రాజగోపాల్, జంబుగుంపల సర్పంచ్ గంగాధర, మాజీ మార్కెట్ యార్డు డైరెక్టర్ లింగప్ప, మాజీ సర్పంచ్ తిప్పేస్వామి, నాయకులు హనుమేష్ మాట్లాడారు.

25న వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశాలు

ఉరవకొండ: ఈనెల 25న ఉరవకొండ, ఉరవకొండ రూరల్‌తో పాటు విడపనకల్లు, వజ్రకరూరు మండలాల వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశాలు జరుగుతాయని పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి సోమవారం తెలిపారు. మాజీ ఎమ్మెల్యే విశ్వ మాట్లాడుతూ ఈనెల 25న ఉదయం 11 గంటలకు ఉరవకొండ పట్టణ, రూరల్ మండలాల సమావేశం ఉరవకొండలోనే ఉంటుందన్నారు. మధ్యాహ్నం 1 గంటకు విడపనకల్లు మండల కేంద్రంలోనూ, మధ్యాహ్నం 3 గంటలకు వజ్రకరూరులో సమావేశం జరుగుతుందన్నారు. మండల నాయకులు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, ఎంపీపీ, జెడ్పీటీసీలు, సర్పంచులు, ఎంపీటీసీలు ప్రతి ఒక్కరూ తప్పక హాజరుకావాలన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ నిరసన

కళ్యాణదుర్గం: వైఎస్సార్‌సీపీ ఎంపీ మిథున్‌రెడ్డి అక్రమ అరెస్టుకు నిరసనగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టనున్నట్లు పార్టీ సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 9.30 గంటలకు స్థానిక ముదిగల్లు రోడ్డులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన ఉంటుందన్నారు. పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సబ్ జైలు తనిఖీ



మాట్లాడుతున్న సివిల్ జడ్జి రాజశేఖర్

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని సబ్ జైలును సివిల్ జడ్జి రాజశేఖర్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఖైదీలతో మఖా ముఖి నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఖైదీలు ఎవరైనా న్యాయవాదిని పెట్టుకునేందుకు స్థోమతలేని వారికి ఉచితంగా న్యాయ సేవలు అందిస్తామని తెలిపారు. ఖైదీలు శిక్షకాలం పూర్తయిన తర్వాత సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. చిన్న విషయాలకు పట్టింపులకు పోయి కేసు పెట్టుకొని కోర్టుల చుట్టూ తిరుగుతూ జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ కౌన్సిల్ దాదా ఖలందర్, న్యాయవాదులు రామాంజనేయులు, చలపతి, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన సేవలే లక్ష్యం

రాయదుర్గంటౌన్: ఖాతాదారులకు మెరుగైన సేవలందించడమే లక్ష్యమని కెనరా బ్యాంకు అనంతపురం జిల్లా రీజినల్ మేనేజర్ కె.శ్రీనివాసులు పేర్కొన్నారు. రాయదుర్గంలో కెనరా బ్యాంకు ఏర్పాటై 25 ఏళ్ల గడిచిన సందర్భంగా బ్యాంకు కార్యాలయంలో సోమవారం సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహించారు. స్థానిక బ్రాంచి మేనేజర్ గురుప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ శ్రీనివాసులు పాల్గొన్నారు. ఖాతాదారులను ఉద్దేశించి ఆర్ఎం మాట్లాడుతూ మొబైల్ బ్యాంకింగ్, ఇంటర్నెట్ బ్యాంకింగ్ వసతి ఉందన్నారు. అనంతరం సీనియర్ ఖాతాదారులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ శేఖర్, మెప్మా టీఎంసీ నారాయణరెడ్డి, సిబ్బంది ప్రదీప్‌కుమార్, మల్లేష్ పాల్గొన్నారు.

ఘర్షణ కేసులో మరో 10 మంది అరెస్ట్



నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

బొమ్మనహాళ్: వివాహేతర సంబంధ కారణంగా ఆస్తి విధ్వంసాలకు పాల్పడిన కేసులో అరెస్టుల సంఖ్య 31కి చేరుకుంది. ఈ నెల 10న 21 మందిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించిన పోలీసులు.. సోమవారం మరో పది మందిని అరెస్ట్ చేశారు. వివరాలను ఎస్ఐ నబీరసూల్ వెల్లడించారు. కొలగానహళ్లికి చెందిన అనంతరాజు కొంతకాలంగా మైలాపురానికి చెందిన ఓ మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తుండడంతో ఈ నెల 7న రాత్రి అనంతరాజుపై మహిళ సంబంధీకులు దాడి చేశారు. దీంతో అనంతరాజు, ఆయన బంధువులు మైలాపురం వెళ్లి చింతకుంట విజయ్‌కుమార్‌రెడ్డి ఇంట్లోకి చొరబడి తలుపులు, టీవీ, రెండు ద్విచక్రవాహనాలు, కారును ధ్వంసం చేశారు. దీనిపై ఇరువర్గాలపై కేసులు నమోదు చేశారు. దీంతో నిందితులను సోమవారం అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. అనంతరాజుపై హత్యాయత్నానికి పాల్పడిన చింతకుంట విజయ్‌కుమార్‌రెడ్డిని ఈ నెల 12న అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే.

అభివృద్ధి చేతకాక అధికార పార్టీ దౌర్జన్యం

- ఏకపక్షంగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహణ
- చైర్మన్ కుర్చీ తొలగించి, మీడియా సమావేశం ఏర్పాటు



ఖాళీ కుర్చీల నడుమ కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్న టీడీపీ సభ్యులు



చైర్మన్ కుర్చీ తొలగించి మీడియా సమావేశం నిర్వహించిన టీడీపీ నేతలు

కళ్యాణదుర్గం రూరల్: కళ్యాణదుర్గాన్ని అభివృద్ధి చేయడం చేతకాక అధికార పార్టీ నేతలు అరాచకాలు, దౌర్జన్యానికి పాల్పడుతున్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్, కౌన్సిలర్లు హాజరుకాకపోయినా కౌన్సిల్ సమావేశం నిర్వహించడమే ఇందుకు నిదర్శనం. మున్సిపాలటీలో 24 వార్డులు ఉండగా కేవలం 10 మంది కౌన్సిలర్లు, వైస్ చైర్మన్ తిమ్మప్ప అధ్యక్షతన కమిషనర్ వంశీ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి చైర్మన్ రాజ్‌కుమార్‌తోటు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు హాజరుకాలేదు. గతంలో కౌన్సిల్ సమావేశం నిర్వహించాలని కమిషనర్‌ను మున్సిపల్ చైర్మన్ రాజ్‌కుమార్ తెలియజేయగా, అందుకు స్పందించిన ఆయన ఎమ్మెల్యే ఎప్పుడు చెప్తే అప్పుడు కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. మున్సిపాలిటీ పరిధిలో సమస్యలు పేరుకుపోతున్నాయని, అనేకమార్లు కౌన్సిల్ సమావేశం నిర్వహిద్దామని కమిషనర్‌ను చైర్మన్ కోరినా ఫలితం లేకుండాపోయింది. సోమవారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో పట్టణ అభివృద్ధికి చైర్మన్, కౌన్సిలర్లు సహకరించడం లేదని చెప్పారు. అధికారపార్టీ నేతలు.. టీడీపీ మహిళా కౌన్సిలర్లతో కలిసి ఏకంగా మున్సిపల్ కార్యాలయంలోని చైర్మన్ చాంబర్‌లోకెళ్లి చైర్మన్ కుర్చీని తొలగించారు. అంతటితో ఆగకుండా అక్కడే మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఇక నుంచి చైర్మన్‌కు చాంబర్ ఉండకూడదని అధికారులకు హుకుం జారీ చేయడం చర్చనీయాంశమైంది.

టీడీపీ నాయకుల కక్ష సాధింపు



వైఎస్సార్‌సీపీ నాయకులతో మున్సిపల్ చైర్మన్ రాజ్‌కుమార్

కళ్యాణదుర్గం రూరల్: పట్టణానికి చెందిన కొందరు టీడీపీ నాయకులు రాజకీయ కక్ష సాధింపు తగదని మున్సిపల్ చైర్మన్ రాజ్‌కుమార్ అన్నారు. మున్సిపల్ చైర్మన్ కనిపించలేదని స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్‌లో కొందరు టీడీపీ నాయకులు సోమవారం ఫిర్యాదు చేయడం విడ్డూరంగా ఉందని అన్నారు. కేవలం రాజకీయ కక్ష్య సాధింపుకోసం మాత్రమే వైఎస్సార్‌సీపీపై నిందలు వేస్తున్నారన్నారు. మున్సిపాలిటీని అభివృద్ధి చేయడం చేతకాక కొందరు అధికార పార్టీకి చెందిన ఇలా వ్యవహరిస్తున్నారన్నారు. అభివృద్ధికి సహకరించాల్సిన అధికారులు కూడా టీడీపీ నేతలకు వత్తాసు పలుకుతున్నారన్నారు. అనవసరంగా రాద్ధాంతం చేయకుండా ప్రజలకు మంచి పాలన అందించాలని తెలిపారు. కౌన్సిలర్ పరమేశ్వరప్ప, నాయకులు వెంకటేశులు, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు రంగయ్య పరామర్శ



చిరంజీవితో మాట్లాడుతున్న మాజీ ఎంపీ రంగయ్య

కళ్యాణదుర్గం: ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కంబదూరు మండలం రాంపురానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు చిరంజీవిని మాజీ ఎంపీ తలారి రంగయ్య పరామర్శించారు. సోమవారం ఆయన పార్టీ రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామితో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్లతో చిరంజీవి ఆరోగ్య పరిస్థితిపై అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకునేలా వైద్యం అందించాలని వైద్యులను కో రారు. వైద్య అవసరాల నిమిత్తం చిరంజీవి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. అదేవిధంగా కుందుర్పి మండలం గురివేపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త నగేష్‌ను పరామర్శించి, ఆర్థికసాయం అందించారు. ఉదయం ఆత్మకూరు మండలం కాలువపల్లి వద్ద జరిగిన కారు ప్రమాదంలో గాయపడిన కళ్యాణదుర్గానికి చెందిన ఐదుగురు క్షతగాత్రులను ఆయన పరామర్శించారు. డాక్టర్ల విభాగం జిల్లా అధ్యక్షులు బొమ్మయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి ములకనూరు తిమ్మరాయుడు, కంబదూరు, శెట్టూరు మండలాల కన్వీనర్లు జి.హనుమంతరాయుడు, ఎంఎస్ రాయుడు, నియోజకవర్గ బూత్ కమిటీ కన్వీనర్ తిప్పేస్వామి, జానీ పాల్గొన్నారు.

బాధితులకు తలారి రంగయ్య ఆర్థిక సహాయం

శెట్టూరు: యాటకల్లులో ఇటీవల గ్యాస్ సిలిండ్ పేలి జీవనోపాధి కోల్పోయిన బాధిత మతం రత్నమ్మ కుటుంబానికి మాజీ ఎంపీ తలారి రంగయ్య సోమవారం ఆర్థిక సాయం అందించారు. ఆర్థిక సాయం అందించిన వారిలో సర్పంచ్ ఈరన్న, మాజీ ఎంపీపీ రామబీమప్ప, నాయకులు రామదాసు, ఈశ్వరప్ప, సత్యనారాయణ, హనుమంతరాయుడు, చంద్ర, రామాంజనేయులు పాల్గొన్నారు.

ఉరగాద్రి అమ్మవారి ఉత్సవాలకు తరలిరండి

ఉరవకొండ: స్థానిక ప్రసిద్ధిగాంచిన ఉరగాద్రి చౌడేశ్వరి అమ్మవారి జయంతి ఈనెల 25న వైభవంగా జరుగుతుందని, ఉత్సవాలకు రావాలని వైఎస్సార్‌సీపీ కళ్యాణదుర్గం సమన్వయకర్త తలారి రంగయ్యను సోమవారం ఆహ్వానించినట్లు ఉరగాద్రి ఆలయ చైర్మన్ కొత్తశరత్ తెలిపారు. సోమవారం ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, మాజీ ఎంపీ తలారి రంగయ్య, పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి, పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రరెడ్డి, ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ లింగాల శివశంకర్‌రెడ్డి, యువజన విభాగం రాయలసీమ జోనల్ చైర్మన్ వై.ప్రణయ్ రెడ్డిని ఆహ్వానించినట్లు తెలిపారు.

సమ్మెకు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ల సంఘీభావం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప

రాయదుర్గంటౌన్: మున్సిపల్ కాంట్రాక్ట్ ఇంజినీరింగ్, పారిశుధ్య కార్మికుల న్యాయమైన డిమాండ్లను కూటమి ప్రభుత్వం పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప డిమాండ్ చేశారు. డిమాండ్ల పరిష్కారం కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె సోమవారంతో తొమ్మిదో రోజుకు చేరుకుంది. కార్మికుల సమ్మెకు మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ మేకల శ్రీనివాసులుతోపాటు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు సంఘీభావం తెలియజేశారు. స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికుల దీక్షా శిబిరంలో మద్దతు ప్రకటించారు. చైర్‌పర్సన్ శిల్ప మాట్లాడుతూ డిమాండ్ల కోసం కార్మికులు సమ్మె చేస్తుంటే ప్రభుత్వం కనీసం స్పందించలేదన్నారు. తక్షణమే జీవో 36 ప్రకారం మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు వేతనాలు ఇవ్వాలని, షరతులు లేకుండా సంక్షేమ పథకాలు అమలు చేయాలని, ఆప్కాస్ పరిధిలో ఉన్న వారందరినీ పర్మినెంట్ చేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం రాష్ట్ర కార్యదర్శి పొరాళ్ల శివకుమార్, కౌన్సిలర్లు గొని లావణ్య, శారదాదేవి, పొరాళ్ల గోవిందరాజులు, పైతోట సంజీవప్ప, కోఆప్షన్ సభ్యులు శ్రీనివాసులు, నజీర్, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్‌లు గొని శ్రీరామిరెడ్డి, అరవ శివప్ప, బషీర్ అహ్మద్, గోనబావి నిజాముద్దీన్, రామాంజనేయులు, భీమనపల్లి దివాకర్, కృష్ణమూర్తి సంఘీభావం తెలిపారు.

జగనన్న కాలనీల్లో కనీస వసతులు కల్పించండి

ఉరవకొండ: స్థానిక రాయంపల్లి రహదారిలోని సర్వే నంబర్ 603లో వైఎస్సార్‌సీపీ హయాంలో వందలాది గృహాలు నిర్మించారని, మౌలిక వసతులు కల్పించాలని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కాలనీవాసులు సోమవారం విన్నవించారు. కాలనీవాసులు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇంటి పట్టాలు అందించి, ఇళ్లు నిర్మించిందని, రోడ్లు నిర్మించాలని, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. తహసీల్దార్ మహబూబ్‌బాషాకు వినతి పత్రం అందించారు.

కేజీబీవీలో కోతుల బెడదపై ఫిర్యాదు

కూడేరు: కేజీబీవీలోకి కోతులు చొరబడి దాడికి యత్నిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నాయని ఉపాధ్యాయినులు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. 200 మంది దాకా బాలికలున్నారని, కోతులు తరగతి గదుల్లోకి చొరబడి దాడికి యత్నిస్తున్నాయన్నారు. 15 అర్జీలు వచ్చాయి. డీటీ ఉదయ్ భాస్కర్ అర్జీలు స్వీకరించారు.హౌసింగ్ డీఈ హనుమప్ప, ఎంపీడీఓ కుళ్లాయి స్వామి, ఎంఈఓ మహమ్మద్ గౌస్, డిప్యూటీ ఎంపీడీఓ రాధాకృష్ణ , ఏపీఓ పోలేరయ్య, ఐసీడీఎస్ సూపర్ వైజర్ సురేఖ, హారికల్చర్ అధికారి జాస్మిన్ పాల్గొన్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోండి

కళ్యాణదుర్గం: ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్సీ,ఎస్టీ జేఏసీ నాయకులు ఆర్డీఓ వసంతబాబుకు వినతిపత్రం అందజేశారు. సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో జేఏసీ తాలూకా అధ్యక్షుడు చెలిమప్ప ఆధ్వర్యంలో బాధితులు ఆర్డీఓను కలిశారు. చెలిమప్ప మాట్లాడుతూ బ్రహ్మసముద్రం మండలం ముద్దలాపురంలో సర్వే నం.336, 364, 210, 193లలో 16 ఎకరాలు ఉందన్నారు. నివాస స్థలంలో పేదలు 40 ఏళ్లుగా నివాస స్థలాలు, గడ్డివాములు వేసుకుని జీవనం సాగిస్తున్నారన్నారు. అయితే ఇటీవల కొందరు సదరు భూమిని ఆక్రమించుకునేందుకు యత్నించారన్నారు. మొత్తం 11 అర్జీలు స్వీకరించినట్లు ఆర్డీఓ తెలిపారు.

ఘనంగా హజరత్ పీరాషావలీ ఉరుసు



ఉరుసుకు పోటెత్తిన భక్తులు



పూల చద్దర్‌లతో అలంకరణ

కణేకల్లు: మండలంలోని యర్రగుంటలో మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే హజరత్ పీరాషావలీ ఉరుసు సోమవారం రాత్రి ఘనంగా జరిగింది. రాయదుర్గం, బళ్లారి, బొమ్మనహాళ్, గుంతకల్లు, ఉరవకొండ, కణేకల్లు, కళ్యాణదుర్గం తదితర ప్రాంతాల నుంచి హిందూముస్లింలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. హజరత్ పీరాషావలీ సమాధిపై నూతన వస్త్రాలు, పూలచద్దర్‌లు పరిచి, భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. మంగళవారం వేకువజామున అశ్వంపై షంషీర్‌ను ఊరేగించనున్నట్లు ఆలయ ధర్మకర్త పూల రంగన్న, గ్రామపెద్దలు తెలిపారు. ఈ వేడుకల్లో దర్గా కమిటీ నిర్వాహకులు బండి రంగారెడ్డి, భీమలింగారెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, చిన్ననల్లారెడ్డి, హరినాథ్‌రెడ్డి, బళ్లారి హనుమంతరెడ్డి, పెద్దనల్లారెడ్డి పాల్గొన్నారు. ఏఎస్ఐ శంకర్‌రెడ్డితోపాటు పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఘనంగా చిన్న సరిగెత్తు

గుమ్మఘట్ట: కలుగోడు, గుమ్మఘట్ట గ్రామాల్లో మొహర్రం సందర్భంగా చిన్న సరిగెత్తు సోమవారం ఘనంగా జరిగింది. పీర్ల స్వాములకు చక్కెర, బెల్లంతో చదివింపులు చేయించి, మొక్కులు తీర్చుకున్నారు. బెల్లంతో తయారు చేసిన పానకాన్ని స్వాములకు నైవేద్యంగా సమర్పించారు.

ఎక్కువ మందికి ఉపాధి పనులు చూపాలి

గుమ్మఘట్ట: గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువ మంది కూలీలకు ఉపాధి పనులు కల్పించాలని జిల్లా విజిలెన్స్ అధికారి శ్రీనివాసులు తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సామాజిక తనిఖీ సమన్వయ సమావేశం నిర్వహించారు. 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి ఆఖరు వరకు ఉపాధి హామీ పథకం పనులకు వివిధ పనుల నిమిత్తం రూ.16 కోట్లు వెచ్చించినట్లు అధికారులు తెలిపారు. ఈపనులపై సామాజిక తనిఖీ బృందం పరిశీలించి, నిజాలను నిగ్గు తేలుస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. పనుల్లో తేడాలు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో జరిగే గ్రామసభలకు ఎక్కువ మంది కూలీలు హాజరయ్యేలా చూడాలన్నారు. ఎంపీడీఓ రామకృష్ణ, ఎస్ఆర్‌పీ నీలకంఠ, ఏపీఓ సురేశ్, సిబ్బంది, మల్లికార్జున, పర్వీద్, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కురవల్లిలో భగవద్గీతపై ప్రచారం

బొమ్మనహాళ్: భగవద్గీత చదివితే జీవన రేఖను మార్చుకోవచ్చు అని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి కళ్యాణదుర్గం కమిటీ అధ్యక్షుడు మేఘరాజు తెలిపారు. సోమవారం కురవల్లి,సిద్దరాంపురం గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం చేశారు. గణేష్, రామోహ్మన్, మారుతి, సాయి, సుష్మా, శ్రావణి, నారాయణమ్మ పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి రాళ్లతో దాడి

కూడేరు: మండలంలోని కొర్రకోడు గ్రామస్తులపై మతిస్థిమితం లేని వ్యక్తి సోమవారం రాళ్లతో దాడి చేశాడు. సోమవారం పొలాలకు వెళ్లే మహిళలు, ద్విచక్రవాహనదారులపై రాళ్లు విసిరాడు. దీంతో సర్పంచ్ చంద్రశేఖర్, గ్రామస్తులు అతన్ని ఆటోలో తీసుకొని వచ్చి పోలీసులకు అప్పగించారు.

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంపు

శెట్టూరు: మండలంలో మంగళవారం నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జిలానీబాషా సోమవారం తెలిపారు. ఈనెల 22 నుంచి 25 వరకు చింతర్లపల్లి, యాటకల్లు-1 సచివాలయాల పరిధిలో క్యాంపు ఉంటుందన్నారు.

రేపు వాహనాల వేలం

రాయదుర్గం: రాయదుర్గం ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కర్ణాటక మద్యం రవాణా చేస్తూ పట్టుబడిన వాహనాలను ఈ నెల 23న వేలం వేస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ మహేష్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు.

ఆర్డీటీని పరిరక్షించండి

కూడేరు: పేదలకు అండగా నిలిచిన ఆర్డీటీని కాపాడాలని విద్యార్థులు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం మండలంలోని మరుట్ల-2వ కాలనీలోని హైస్కూల్‌లో 200 మంది విద్యార్థులు ఆర్డీటీ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 'సేవ్ ఆర్డీటీ' పేరిట కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు పోస్టుకార్డులు రాసి పంపారు. కార్యక్రమంలో పరిరక్షణ సమితి సభ్యులు అక్కమ్మ, ముత్యాలు సంజీవ రాయుడు, సుబ్బరాయుడు, పెన్నహోబులేసు పాల్గొన్నారు.

ఆర్డీటీపై ఆంక్షలు ఎత్తేయాలని ర్యాలీ

కణేకల్లు: ఆర్డీటీపై ఆంక్షలు ఎత్తేసి ఎఫ్‌సీఆర్ఏను రెన్యువల్ చేయాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. ఆర్డీటీని పరిరక్షించాలని కోరుతూ కణేకల్లు ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులు, కేజీబీవీ విద్యార్థులు

సంక్షిప్త సమాచారం

సోమవారం ర్యాలీ చేశారు. ఎఫ్‌సీఆర్ఏను రెన్యువల్ చేయాలి, ఆర్డీటీని కాపాడాలని విద్యార్థులు నినాదాలు చేశారు. ర్యాలీ అనంతరం తహసీల్దార్ బ్రహ్మయ్యకు విద్యార్థులు వినతిపత్రం సమర్పించారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సర్పంచ్ రామిరెడ్డి

బెళుగుప్ప: నక్కలపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం బదిలీ అయిన ఉపాధ్యాయులకు హెచ్ఎం జయరామ్ అధ్యక్షతన సన్మానం చేశారు. బదిలీ అయిన యు.శ్రీనివాసులు, వీరేశేఖర్, తిరుమలరెడ్డి, రేణుకాదేవిని సన్మానించారు. సర్పంచ్ రామిరెడ్డి, గ్రామస్తులు గోవిందరెడ్డి, వెంకటరామిరెడ్డి, పాఠశాల కమిటీ చైర్మన్ శేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన

ఉరవకొండ: కూటమి ప్రభుత్వం రైతులను దగా చేసిందని అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు పెట్టుబడి సాయం ఇవ్వకుండా రైతులను వేధిస్తోందని సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలియజేశారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణమూర్తి మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం మోసగిస్తోందన్నారు. తహసీల్దార్ మహబూబ్‌బాషాకు వినతి పత్రం అందించారు. నాయకులు రంగారెడ్డి, మధుసూదన్, జ్ఞానమూర్తి, వెంకటేష్, సుంకన్న, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు

బెళుగుప్ప: కాలువపల్లి వద్ద జాతీయ రహదారిపై నిలిపిన లారీని వెనుకవైపు నుంచి కారు ఢీకొనడంతో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. కళ్యాణదుర్గానికి చెందిన రాజేష్ తన మేనమామ సంగప్పకు సోమవారం గుండెపోటు రావడంతో బంధువు అయిన రాజు, జానకి, మల్లక్కలతో కలసి అనంతపురానికి బయల్దేరారు. కాలువపల్లి వద్ద ఆగివున్న లారీని వెనుకవైపు నుంచి కారు ఢీకొనింది. ఈ ప్రమాదంలో కారులోని ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివ తెలిపారు.

మోడల్ స్కూల్‌లో సీట్ల భర్తీపై విచారణ చేయాలి

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో 6,7,8,9 తరగతుల్లో సీట్ల భర్తీలో జరిగిన అవకతవకలపై క్షేత్రస్థాయి విచారణ చేపట్టాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి ఆంజనేయులు డిమాండ్ చేశారు. ఈమేరకు ఏఐఎస్ఎఫ్ నాయకులు సోమవారం మండల విద్యాశాఖాధికారి నాగమణికి వినతిపత్రం అందజేశారు. పరీక్షలు రాసిన మెరిట్ విద్యార్థులకు అన్యాయం చేసేలా కొందరు ఉపాధ్యాయులు ఇష్టానుసారంగా సీట్లను కేటాయించినట్లు ఆరోపించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు తరుణ్, మోహన్, హరి పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల భిక్షాటన

రాయదుర్గంటౌన్: డిమాండ్లు పరిష్కరించాలని మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె సోమవారం కొనసాగింది. సమ్మెకు పారిశుధ్య కార్మికులు మద్దతు తెలుపుతున్నారు. సోమ వా రం కార్మికులంతా పట్టణంలో భిక్షాటన చేశారు. డిమాండ్లను పరిష్కరించేంత వరకు సమ్మె కొనసాగుతుందని సీఐటీయూ నేత మల్లికార్జున హెచ్చరించారు.

కళ్యాణదుర్గం రూరల్: స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు చేపట్టిన సమ్మె సోమవారం ఐదోరోజుకు చేరుకుంది. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

ముళ్ల కంపల్లోకి దూసుకెళ్లిన ట్రక్కు

బొమ్మనహాళ్: మండల కేంద్రంలోని ఎంఆర్సీ సమీపంలోని బళ్లారి-కళ్యాణదుర్గం అంతరాష్ట్ర రాహదారి వద్ద భారీ ట్రక్కు ముళ్ల కంపల్లోకి దూసుకెళ్లింది. సోమవారం ఉదయం హిందూపురం వైపు నుంచి బొమ్మనహాళ్ సమీపంలో ఉన్న ఓ కర్మాగారానికి వెళ్తూ అదుపు తప్పి రోడ్డు పక్కన గోతిలోకి దూసుకెళ్లింది. అయితే డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు. ఆ సమయంలో ఎవరూ ఎదురుగా రాకపోవడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.

విద్యార్థుల్లోని ప్రతిభ వెలికితీయాలి

- సంగీత దర్శకుడు ఖుద్దూస్



విద్యార్థినికి జ్ఞాపికలు అందిస్తున్న సంగీత దర్శకుడు ఖుద్దూస్

ఉరవకొండ: విద్యార్థులు చదువుతో పాటు వారిలో దాగి ఉన్న నైపుణ్యాలను, ప్రతిభను వెలికితీ యాలని ప్రముఖ సినీ సంగీత దర్శకుడు, తెలుగు టెలివిజన్, డిజిటల్ మీడియా మ్యూజీషియన్స్ యూనియన్ వ్యవస్థాపకుడు ఎస్‌పి ఖుద్దూస్ సూచించారు. సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాలను ఆయన సందర్శించారు. విద్యార్థినులకు నైతిక విలువలు, సామాజిక బాధ్యత, భావితర భవిష్యత్తును గుర్తు చేస్తూ అవగాహన సమావేశం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ షాషావలి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఖుద్దూస్ మాట్లాడారు. సాంకేతికంగా అభివృద్ధి చెందుతున్న ప్రస్తుత సమాజంలో అంతకన్న వేగంగా కమ్యూనికేషన్ స్కిల్స్ నేర్చుకొని, పోటీ ప్రపంచంలో ఎంచుకున్న రంగాల్లో రాణించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. విద్యతో పాటు కళా నైపుణ్యాన్ని ప్రదర్శించేలా కృషి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపి ఉరవకొండలో సంగీత కళాశాల ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం పలు సినీ గీతాలను ఆలపించి విద్యార్థులను ఉత్తేజ పరిచారు. చదువులో రాణిస్తున్న విద్యార్థినులను ప్రోత్సహిస్తూ జ్ఞాపికలు, నగదు బహుమతులు అందించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ షాషావలి, అధ్యాపకులతో కలిసి సంగీత దర్శకులు ఖుద్దూస్‌ను సత్కరించారు.

ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్ట్
అప్రజాస్వామికం

రాయదుర్గం: వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని రాజకీయ కక్షతోనే లిక్కర్ స్కాంలో ఇరికించి అక్రమంగా అరెస్ట్ చేయటం అప్రజాస్వామికమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు ముక్తకంఠంతో ఖండించారు. ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టు ముమ్మాటికీ రాజకీయ కుట్ర అని రాష్ట్ర ప్రజలందరికీ తెలుసన్నారు. లేని లిక్కర్ స్కాంను ఉన్నట్లు చూపడం దుర్మార్గమని మండిపడ్డారు.

దారుణ పరిస్థితులు చూస్తున్నాం

కూటమి సర్కార్ అధికారం చేపట్టిన నాటి నుంచి దారుణ పరిస్థితులు చూస్తున్నాం. దాడులు, దౌర్జన్యాలు, హత్యలు, అక్రమ కేసులతో అణచివేయాలని చూస్తున్నారు. లేని లిక్కర్ స్కాంలో ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని అరెస్టు చేయడం అప్రజాస్వామికం. 2014-19 టీడీపీ పాలనలో మద్యం మాఫియా సాగింది. రాష్ట్ర వ్యాప్తంగా 4,380 లిక్కర్ షాపులు, 43 వేలు షాపులు, ఇష్టారాజ్యంగా పర్మిట్ రూమ్‌లు అప్పగించారు. వైఎస్సార్‌సీపీ హయాంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నూతన మద్యం పాలసీ అమల్లోకి తీసుకొచ్చి పారదర్శకతకు పెద్దపీట వేశారు. రాష్ట్ర ఆదాయం కోల్పోవాల్సి వస్తున్నా ప్రజా సంక్షేమం కోసం లెక్క చేయలేదు. తాజాగా మళ్లీ కూటమి సర్కార్ పాత విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చి మద్యం ఏరులై పారిస్తోంది.

– మెట్టు విశ్వనాథ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, రాయదుర్గం

దుర్మార్గమైన చర్య

ఎంపీ మిథున్‌రెడ్డిని అరెస్టు చేయడం దుర్మార్గమైన చర్య. కూటమి అరాచకాలను రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారు. రాజకీయ కక్షతో జగన్ చుట్టూ ఉండే వారిని టార్గెట్ చేస్తూ అరెస్టులు చేస్తున్నారు. లిక్కర్ స్కాం కేసులో సిట్ నేటికీ సరైన ఆధారాలు బయటపెట్టలేకపోయింది. వైఎస్సార్‌సీపీని అణచివేయాలని చూస్తున్నారు. ఇది సరైన పద్ధతికాదు. మిథున్‌రెడ్డి అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నాం.

– భోజరాజ్‌నాయక్, ఎస్టీసెల్ రాష్ట్ర కార్యదర్శి

ఆధారాలు లేకుండా అరెస్టులు

లిక్కర్ స్కాం కేసులో ఎలాంటి ఆధారాలు చూపకుండానే వరుస అరెస్టులు చేయడం దుర్మార్గం. మాజీ సీఎం జగన్ చుట్టూ వాళ్లనే టార్గెట్ చేస్తూ అరెస్టులు చేస్తున్నారు. ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నాం. ప్రజలు అధికారం ఇచ్చింది కక్షసాధింపు చర్యలకు కాదనేది అధికార పార్టీ తెలుసుకోవాలి.

– ఉషారాణి, రాష్ట్ర సహాయ కార్యదర్శి

కడిగిన ముత్యంలా వస్తారు

ఎంపీ మిథున్‌రెడ్డిపై రాజకీయ కక్షతోనే అక్రమ కేసు పెట్టారు. లిక్కర్‌స్కాం కేసులో ఎలాంటి ఆధారాలు లేకున్నా అరెస్టులు చేస్తున్నారు. లిక్కర్ వ్యాపారం చేయడం కాని ఆ వ్యవహారం లో తలదూర్చే విధానానికి ఎంపీ దూరంగా ఉంటున్నారు. ఎన్ని కుట్రలు పన్నినా చివరకు న్యాయమే గెలుస్తోంది. కడిగిన ముత్యంలా ఆయన బయటకు వస్తారు.

– పొరాళ్ల శివకుమార్, చేనేత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

నియంతృత్వ పోకడ

కూటమి ప్రభుత్వం కక్షపూరితంగా వైఎస్సార్‌సీపీ నాయకులపై తప్పుడు కేసులు పెడుతోంది. ఎంపీ మిథున్‌రెడ్డిపై నమోదైన లిక్కర్ స్కాం కేసుకూడా అలాంటిదే. ఇది నిలబడే కేసు కాదు తప్పుడు కేసు అనేది ప్రజలందరికీ తెలుసు. కూటమి అధికారం చేపట్టిన నాటి నుంచి పెద్దిరెడ్డి కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని అక్రమ కేసులతో వేధింపులకు గురిచేయడం సరైంది కాదు.

– బీటీపీ గోవిందు, ఎస్సీసెల్ రాష్ట్ర సహాయ కార్యదర్శి

రోజాపై వ్యాఖ్యలు సరికాదు

ఉరవకొండ: నగరి ఎమ్మెల్యే భానుప్రకాష్ నీచ సంస్కృతికి తెరతీశారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం నాయకురాలు, ఉరవకొండ మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ బోయసుశీలమ్మ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. సోమవారం వజ్రకరూరు మండలం హొతూరులోని తన స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. పార్టీలో ఎంతో సీనియర్ నాయకురాలిగా ఎమ్మెల్యే, మంత్రిగా పని చేసిన ఆర్కే రోజాను అసభ్యకరంగా మాట్లాడిన ఎమ్మెల్యే భానుప్రకాష్ బేషరతుగా మాజీ మంత్రి రోజాకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. రోజా వ్యక్తిత్వహననం చేస్తూ మాట్లాడి ఏం సాధించాలని ఎమ్మెల్యే అనుకుంటున్నారో చెప్పాలన్నారు. సభ్యసమాజం తలదించుకునేలా మాట్లాడిన ఎమ్మెల్యే భానును చంద్రబాబు అతన్ని ఎమ్మెల్యే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని మహిళా హోం మంత్రి ఉన్నా మహిళలపై ఎక్కడా దాడులు ఆగడం లేదని తెలిపారు. మాజీ మంత్రి రోజాపై చేసిన వాఖ్యలకు ఎమ్మెల్యే భాను బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

అసత్య ప్రచారాలు నమ్మొద్దు

కుందుర్పి: రుంద్రంపల్లి యూపీ పాఠశాలకు ఎస్ఎస్‌సీ కోడ్ వస్తుందని మండల విద్యాధికారి తిప్పేస్వామి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రుద్రంపల్లి యూపీ పాఠశాలను ఈ ఏడాదే ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేశారని, దీంతో ఎస్సెస్సీ కోడ్ తప్పక వస్తుందన్నారు. పనికట్టుకొని ఈ పాఠశాలలో విద్యార్థులను చేర్పించొద్దని హెచ్ఎం శివానందరెడ్డి, ఉపాధ్యాయులు అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు. జిల్లా విద్యాధికారి ప్రసాద్‌బాబు ఎస్ఎస్‌సీ కోడ్ వస్తుందని హామీ ఇచ్చారని తెలిపారు. ఎవరైనా ఎస్ఎస్‌సీ కోడ్ రాదని ప్రచారం చేస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.